

మూన్నాళ్ల ముచ్చటగా ఓపెన్ జిమ్‌లు

- నాణ్యత లేక తరుచూ పాడవుతున్న నాసిరకం పరికరాలు
- మరమ్మతు చేయకపోవడతో నిరుపయోగం
- అలంకారప్రాయంగా రీడింగ్‌రూంలు
- ప్రజాధనం దుర్వినియోగం

ఏసీసీ, జూన్ 23: ప్రజలకు శారీరక ఆరోగ్యంతో పాటు ఆహ్లాదం పంచేందుకు మంచిర్యాల పట్టణంలోని పార్కుల్లో ఓపెన్ జిమ్‌లను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రైవేటు జిమ్‌లకు వెళ్ళే ఆర్థిక వెసలుబాటు లేని వారికి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు ఉపయోగపడేవి. వృద్ధులు, పిల్లలు, యువకులు సమీపంలోని పార్కులకు వెళ్లి ఓపెన్ జిమ్ పరికరాలతో ఎక్సర్‌సైజులు చేసేందుకు, పిల్లల ఆట పరికరాలతో ఆడుకునేందుకు ఉపయోగంగా ఉంటాయని వీటిని ఏర్పాటు చేశారు.



జాఫర్ నగర్‌లో పార్కులో పాడైపోయిన పిల్లల ఆట పరికరాలు

● మూలనపడిన పరికరాలు

పట్టణంలోని వివిధ వార్డుల్లోని పార్కుల్లో దాదాపు 15 ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో దానికి పరికరాలు, ప్లాట్‌ఫాం, గ్రీన్ మ్యాట్‌లకు కలిపి రూ.15 లక్షల వరకు వెచ్చించారు. మరికొన్ని పార్కుల్లో ఓపెన్ జిమ్‌లతోపాటు పిల్లల ఆట పరికరాలు, రీడింగ్ రూంల పేరిట అదనంగా నిధులు వెచ్చించి ఏర్పాటు చేశారు. ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు చేసిన కొద్ది రోజులకే పాడవడం, రిపేర్లు చేయించినా తరుచూ మరమ్మతుకు రావడంతో నిరుపయోగంగా ఉన్నాయి. ఒక్కో పరికరానికి లక్ష నుంచి లక్షా 50 వేల వరకు వెచ్చించారు. నాసిరకం ఐరన్ పైపులు, షీట్‌లు, బేరింగులతో సరైన



రెడ్డి కాలనీ పార్కులో పాడైపోయిన ఓపెన్ జిమ్ పరికరం



రెడ్డి కాలనీలో నిరుపయోగంగా ఉన్న రీడింగ్‌రూం

సాంకేతిక నైపుణ్యం లేని స్థానికంగా ఉండే వెల్డింగు షాపుల్లో తయారు చేయించినట్లు సమాచారం. దీంతో తరుచూ పాడవుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఓపెన్ జిమ్‌లలో అనేక చోట్ల పరికరాలు వెల్డింగ్ చేసిన చోట ఊడిపోవడం, విరిగిపోవడం వంటివి జరుగుతున్నాయి. సకాలంలో రిపేర్లు చేయించకపోవడంతో నెలల తరబడి వినియోగానికి పనికి రాకుండా వృథాగా పడి ఉంటున్నాయి.

● వినియోగంలోకి లేని రీడింగ్ రూంలు

పట్టణంలోని పార్కుల్లో రీడింగ్ రూమ్-వాచ్‌మన్ రూం పేరిట లక్షల రూపాయలు వెచ్చించి గదులు నిర్మించినప్పటికి ఇవి నిరుపయోగంగా ఉంటున్నాయి. రీడింగ్ రూమ్‌ల అద్దాలు, కిటికీలు పాడైపోతున్నాయి. పిల్లల ఆట పరికరాలు కొన్ని పార్కుల్లో పాడైపోయి ఏండ్లు గడవడంతో చెట్లు మొలిచి పొదల్లో కనిపించకుండా ఉన్నాయి. పిల్లల ఆట పరికరాలను రిపేరు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. రీడింగ్ రూంలలో కుర్చీలు, బల్లలు ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. ఓపెన్ జిమ్‌లు, పిల్లల ఆట పరికరాలు, రీడింగ్‌రూంల పేరిట ప్రజాధనం వెచ్చించినా నిరుపయోగంగా మారడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతు చేయించాలి

-ప్రసాద్

ఓపెన్ జిమ్ పరికరాలను వెంటనే మరమ్మతు చేయించి అందుబాటులోకి తీసుకురావాలి. వాటితో పాటు పిల్లల ఆట పరికరాలను కూడా బాగు చేయించాలి. రీడింగ్ రూంలను వినియోగంలోకి తెస్తే సాయంత్రం సీనియర్ సిటిజన్‌లు ఒక చోట కూర్చుని చదువుకోవడానికి అనువుగా ఉంటుంది.

క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



ఒలింపిక్ డే రన్‌ను ప్రారంభిస్తున్న మాజీ విప్

మందమర్రిటౌన్, జూన్ 23: క్రీడల అభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని మాజీ ప్రభుత్వ విప్, కాంగ్రెస్ నాయకులు నల్లాల ఓదెలు తెలిపారు. ఆదివారం సింగరేణి పాఠశాల వద్ద ఒలింపిక్ రన్‌ను ప్రారంభించారు. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఒలింపిక్ జ్యోతితో రన్ నిర్వహించారు. కోల్‌బెల్ట్ రోడ్డు మీదుగా మార్కెట్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా సభ్యులు కనపర్తి రమేష్, క్రీడాకారుడు రాంవెంకటేశ్వర్లు, ఐఎన్‌టీయూసీ నాయకులు కాంపెల్లిసమ్మయ్య, కాంగ్రెస్ నాయకుడు గుడ్ల రమేష్, క్రీడాకారులు అరవింద్, రాజలింగు, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు



రక్తదానం చేస్తున్న దాతలు

బెల్లంపల్లి(తాండూర్), జూన్ 23 : రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చని విద్యాభారతి విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు సురభి ఆగమరావు అన్నారు. ఆదివారం విద్యాసంస్థల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అయన మాట్లాడుతూ రక్తదానం చేయడానికి యువకులు, ప్రజలు ముందుకు రావాలన్నారు. ప్రమాదాలకు గురైన, తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తం అవసరం ఉంటుందని తెలిపారు. రక్తదాన శిబిరంలో 54 మంది రక్తదానం చేయగా ప్రశంసాపత్రాలు అందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ వైద్యులు రంజిత్‌కుమార్, సభ్యులు కాసర్ల శ్రీనివాస్, మాధవి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న టీవీఆర్‌వోడబ్ల్యూఏ నాయకులు

బెల్లంపల్లి, జూన్ 23: గతంలో వీఆర్‌వోలుగా పనిచేసిన తమ సమస్యలను పరిష్కరించాలని ఆదివారం కలెక్టర్ కుమార్ దీపక్‌కు తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం (టీవీఆర్‌వోడబ్ల్యూఏ) జిల్లా అధ్యక్షుడు సురిమిల్ల స్వామిదాస్, ప్రధాన కార్యదర్శి రాంకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రతిభలు వినతిపత్రం అందించారు. వీఆర్‌వోలను రీడెప్లాయిమెంట్ పేరుతో రెవెన్యూ శాఖ నుంచి తప్పించి వేర్వేరు శాఖలకు బదిలీ చేశారన్నారు. వేతనాల నుంచి జీపీఎఫ్, సీపీఎస్ చెల్లింపులు నిలిచిపోయాయని, ప్రభుత్వం ప్రకటించిన 5 శాతం ఐఆర్ వర్తించలేదన్నారు. కొన్ని ప్రభుత్వ శాఖల్లో సాంక్షన్ పోస్టులు లేక జూనియర్ అసిస్టెంట్ కంటే తక్కువ స్థాయి పోస్టుల్లో నియమించడంతో పదోన్నతి విషయంలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులోకి వెళ్లాల్సి వస్తుందన్నారు.

భారీ వాహనాలపై నిషేధం ఎత్తివేయాలి

జన్నారం, జూన్ 23: లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం మీదుగా అటవీ శాఖ భారీ వాహనాల రాకపోకలపై విధించిన నిషేధాన్ని ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని ఆదివారం ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుకు సామాజిక పోరాట సమితి నాయకులు వినతిపత్రం అందించారు. రాకపోకలపై నిషేధం ఉండడంతో అభివృద్ధి జరగడం లేదన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. భూమాచారి, శ్రీనివాస్, ఓంకారేశ్వర్, అక్బర్, పరశురాం పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించండి



సమస్యలు తెలుసుకుంటున్న డీసీసీ అధ్యక్షురాలు

నస్పూర్, జూన్ 23 : నస్పూర్ మున్సిపాలిటీలో వరద ప్రభావిత ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. మున్సిపాలిటీలోని అల్లూరి సీతారామరాజునగర్, వినూత్నకాలనీ, జాన్సీనగర్‌లో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆదివారం పర్యటించారు. ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను స్థానికులు వివరించారు. గతేడాది వరద నీరు ఇళ్ళలోకి చేరిందని, ప్రస్తుతం అలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లను చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్, ఏతం మధు, మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ళ వేణు, కౌన్సిలర్లు కోడూరి లహరి విజయ్, సీపతి సుమతిమల్లేష్, మహేష్, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

28న గైనకాలజిస్ట్ పోస్ట్‌కు ఇంటర్వ్యూ

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 23: జాతీయ ఆరోగ్య మిషన్ కింద చెన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో గైనకాలజిస్టు పోస్టుకు ఈ నెల 28న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌వో అనిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నస్పూర్‌లోని జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో సాయంత్రం 4 గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. అభ్యర్థులు ఎంబీబీఎస్, ఎండీ అబ్స్టెట్రిక్స్, గైనకాలజిస్టు, ఆల్ట్రాసౌండ్ అర్హత కలిగి ఉండాలన్నారు. అర్హులైన వారు హాజరు కావాలని కోరారు.

స్పోర్ట్స్ పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

భీమిని, జూన్ 23 : హకీంపేట స్పోర్ట్స్ పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి మహేశ్వర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమిని, కన్నెపల్లి, నెన్నెల, బెల్లంపల్లి మండలాలకు చెందిన 5వ తరగతి విద్యార్థులు ఈ నెల 25వ తేదీ ఉదయం 11 గంటలకు బెల్లంపల్లిలోని ఏఎంసీ 2 గ్రౌండ్ వద్ద ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. 2015 సెప్టెంబరు 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించిన బాల బాలికలు అర్హులన్నారు. బోనఫైడ్, కుల ధ్రువీకరణ, ఐదు ఫొటోలతో హాజరు కావాలన్నారు.


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



ఏసీసీ, జూన్ 23: జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం పీఆర్‌టీయూ తెలంగాణ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ధరణికోట వేణుగోపాల్ క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాల నుంచి పరిష్కారం కాని పండిత్,పీఈటీ పోస్టుల ప్రమోషన్‌లను ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయడం ఆనందంగా ఉందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్‌టీయూ కృషి చేస్తుందన్నారు. భారతి, రవికాంత్, సుధీర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం

ఏసీసీ, జూన్ 23: రైతుల రుణమాఫీ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందని ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు అన్నారు. ఆదివారం మంచిర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక మండలి ప్రమాణ స్వీకారం పద్మనాయక ఫంక్షన్‌హాలులో నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖలు మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతు పక్షపాతి అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. 2 లక్షల రుణమాఫీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. అనంతరం పాలక మండలి చైర్‌పర్సన్‌గా పయ్యావుల పద్మ, వైస్ చైర్మన్‌గా బండారి సుధాకర్, డైరెక్టర్‌లుగా తాజమ్ముల్, శ్రీనివాస్, సావిత్రి, రమేష్‌నాయక్, సతీష్, సత్యనారాయణ, సంతోష్, లింగయ్య, మల్లేష్, జనార్దన్, కుమార్‌జాజు, మహేష్, రామారావులు ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు.



మార్కెట్‌కమిటీ ప్రమాణస్వీకారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

మంచిర్యాల పట్టణంలోని 7వ వార్డు ఎన్‌టీఆర్ నగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. వార్డులో మంచినీటి సరఫరా సమస్య ఉందని వార్డు ప్రజలు చెప్పగా ఆదివారం ఎమ్మెల్యే సందర్శించి ప్రజలతో మాట్లాడారు. సమస్యను రెండు రోజుల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

నామినేటెడ్ పద్ధతిలో బొగ్గు బ్లాకులు సింగరేణికే ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు

నస్పూర్, జూన్ 23: తెలంగాణలో బొగ్గు బ్లాకులను నామినేటెడ్ పద్ధతిలో సింగరేణికే కేటాయించాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు డిమాండ్ చేశారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో సింగరేణిని కాపాడేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కారుణ్య నియామకాలను ప్రవేశపెట్టి సంస్థ మనుగడకు కృషి చేసిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ జాతీయ పార్టీలు బొగ్గు బ్లాకులను వేలం ద్వారా అదానీ, అంబానీలకు కట్టబెట్టే కుట్రకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో విస్తరించిన సింగరేణి బొగ్గు గనులతో లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కలుగుతుందన్నారు. కొత్తగా గనుల వేలం ద్వారా కార్పొరేట్ సంస్థలకు గనులను అప్పగిస్తే స్థానికంగా ఉపాధి కోల్పోవడంతో సింగరేణికి నష్టాలు వస్తాయన్నారు. తాము కార్మికులకు అండగా ఉండి సంస్థ మనుగడకు పాటుపడుతున్నామన్నారు.

ఆకర్షణ పేరిట కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ నాయకులను చేర్చుకోవడం తగదని, పోచారం శ్రీనివాసరెడ్డి పార్టీ మారడం ఆయన వయస్సుకు సరైనది కాదన్నారు. ప్రశ్నించిన బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదన్నారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అక్కూరి సుబ్బయ్య, మెరుగు పవన్‌కుమార్, టీబీజీకేఎస్ ఏరియా ఇన్‌చార్జి పెట్టెం లక్ష్మణ్, పెద్దపల్లి కోటిలింగం, సత్తయ్య, నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, వంగ తిరుపతి, జక్కుల రాజేశం, కుమార్, రఫీక్ ఖాన్ పాల్గొన్నారు.

పాలీసెట్ కౌన్సెలింగ్

బెల్లంపల్లి, జూన్ 23: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలీసెట్ కౌన్సెలింగ్ కొనసాగుతుంది. ఆదివారం 325 మంది కౌన్సెలింగ్‌కు హాజరైనట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి తెలిపారు. విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించామని, కౌన్సెలింగ్‌కు వచ్చిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

బెల్లంపల్లి(తాండూర్), జూన్ 23: తాండూర్‌లోని శ్రీదేవి స్వశక్తి అనాథా శరణాలయంలోని పిల్లలకు మాతృహృదయం సంక్షేమ సంస్థ సభ్యులు ఆదివారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. అధ్యక్షుడు రంజిత్‌కుమార్, శ్రీనివాస్, కృష్ణదేవరాయలు, వంశీకృష్ణ, తాజుద్దీన్, అమీర్, సదానందం, ఆశ్రమం నిర్వహకులు శ్రీదేవి, మల్లేశం, పిల్లలు పాల్గొన్నారు.

బహుజనులు ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి

లక్షెట్టిపేటరూరల్, జూన్ 23: రాజ్యాంగం రక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని, బహుజన సమాజం, విద్య, ఉపాధి అవకాశాలను అంది పుచ్చుకోవాలని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య పేర్కొన్నారు. ఆదివారం విశ్రాంతి భవనంలో దండేపల్లి, హాజీపూర్, లక్షెట్టిపేట మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కొన్ని పార్టీలు రాజ్యాంగాన్ని మార్చడానికి కుట్రలు చేస్తే గత ఎన్నికల్లో ప్రజలు కర్ర కాల్చి వాత పెట్టారన్నారు. అనంతరం జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర కార్యదర్శి మంతెన లింగయ్య, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రాజలింగం ఆధ్వర్యంలో కొల్లూరి రవికుమార్‌ను మంచిర్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకుని నియామక పత్రం అందించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, నాయకులు నవీన్, సురేష్, విక్రమ్, ఈశ్వర్, దుర్గాప్రసాద్, దినేష్, కుమార్, సతీష్, ప్రశాంత్, కిరణ్ పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

బెల్లంపల్లి, జూన్ 23: బెల్లంపల్లిలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండగా ఉండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం దాదాపు గంట పాటు కురిసింది. దీంతో పలు రోడ్లు జలమయంగా మారాయి. కాంట్రాక్టర్ బస్తీలో మున్సిపల్ సిబ్బంది నాలాలు శుభ్రం చేయకపోవడంతో ఇండ్లలోకి వర్షం నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

మందమర్రిటౌన్: మందమర్రిలో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. దీంతో పట్టణంలోని రోడ్లపై నీరు నిలిచింది. పలు కాలనీలు జలమయమయ్యాయి. భాగ్యనగర్ కాలనీలో రోడ్డుపై నీరు నిలిచిపోయింది. సింగరేణి పాఠశాల మైదానం చిత్తడిగా మారింది. సీఈఆర్ క్లబ్ వద్ద గల పాలవాగు నీటితో నిండిపోయింది. ఒక్కసారిగా కురిసిన వర్షంతో వాతావరణం చల్ల బడిపోయింది.

ఘనంగా బలిదాన్ దివస్



మంచిర్యాల, జన్నారంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న బీజేపీ నాయకులు

ఏసీసీ, జూన్ 23: జనసంఘ్ వ్యవస్థాపకుడు, మాజీ కేంద్ర మంత్రి శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జైన్, హరికృష్ణ, అశోక్, రమణరావు, మల్లేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

హాజీపూర్: నర్సింగాపూర్‌లో భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను నిర్వహించారు. బూత్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, స్వామి, తిరుపతి, నాయకులు మల్లేష్, వెంకటి, అజయ్ పాల్గొన్నారు.

జన్నారం: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్‌ను మండల కేంద్రంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శంకరయ్య, మధుసూదన్‌రావు,గోలి చందు, ప్రవీణ్, సూర్యం, జలపతి, దిలీప్ పాల్గొన్నారు.

చెన్నూరు: పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో బీజేపీ జన్‌సంఘ్ వ్యవస్థాపకులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు జాడి తిరుపతి, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, వెంకటేశ్వర్‌గౌడ్, మల్లారెడ్డి, అశోక్, సమ్మయ్య, శ్రీనివాస్, వెంకటనర్సయ్య, పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: బీజేపీ కార్యాలయంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పట్టణ అధ్యక్షుడు వేముల అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ప్రధాన కార్యదర్శి ఈశ్వరచారి, మాస్ సత్యనారాయణ, సీనియర్ నాయకులు బంగారు వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు వైద్య శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సంతోష్‌రా నాయక్, కుమ్మరి రామకిషోర్, జీడి ప్రభాకర్, మోత్కూరి దేవేందర్ పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి



నవీన్ (ఫైల్)

మందమర్రి టౌన్, జూన్ 23: పట్టణంలోని కేకే1 గని సమీపంలో ఎక్స్‌కావేటర్ బకెట్ ఢీకొన్న సంఘటనలో కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరుకు చెందిన నవీన్(35) మృతి చెందాడు. కార్మికుడిని ఆదుకోవాలని పలు సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. అటవీ ప్రాంతంలో ఇసుక తీస్తుండగా ట్రాక్టర్ దిగబడింది. ఎక్స్‌కావేటర్‌తో తీసేందుకు ప్రయత్నిస్తుండగా డ్రైవర్ నిర్లక్ష్యంతో నవీన్‌కు బకెట్ తగిలి గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రిలో చేర్పించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నవీన్ 15 సంవత్సరాలుగా యజమాని రాజేషం ఇటుకల కంపెనీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. నవీన్ భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. నవీన్ మృతితో ఐదుగురు పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది.

ఘనంగా అకాడి

బెజ్జూరు/పెంచికలపేట, జూన్ 23:బెజ్జూరు, మండలకేంద్రంతోపాటు ఎల్కపల్లి, చిన్నసిద్దాపూర్, నాగులవాయి, కుశ్నపల్లి, పెంచికలపేట మండలంలోని పలుగ్రామాల్లో ఆదివారం అకాడి పండగను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆయాగ్రామాల్లో ప్రజలు గ్రామదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. రైతులు చేల్లలో విత్తనాలు విత్తుకున్న అనంతరం గ్రామదేవత లకు మొక్కులు చెల్లించడం ఆనవాయితీ.

27 నుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



మాట్లాడుతున్న అసోసియేషన్ సభ్యులు

ఏసీసీ, జూన్ 23: ఉమ్మడి ఆదిలాబాద్‌జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్‌ఆధ్వర్యంలో మంచిర్యాలలోని గ్రీన్‌సిటీ మాస్టర్స్ ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బండ మీనారెడ్డి, ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్ తెలిపారు. ఆదివారం మంచిర్యాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ యానిక్స్ సన్‌రైజ్ 10వ రాష్ట్రస్థాయి సీనియర్‌మెన్, ఉమెన్స్ బ్యాడ్మింట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఈ టోర్నమెంట్‌కు దాదాపు 300మంది క్రీడాకారులు హాజరవుతార న్నారు. పాల్గొనే వారికి భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. 27 నుంచి క్వాలిఫైడ్ మ్యాచ్‌లు, 28నుంచి30వరకు మెయిన్‌డ్రా మ్యాచ్‌లు జరుగుతాయన్నారు.సత్యపాల్‌రెడ్డి,రమేష్‌రెడ్డి,మధు,కృష్ణతదితరులు పాల్గొన్నారు.

చెరువు వద్ద మత్స్యకారుల ధర్నా



కిష్టాపూర్ చెరువు వద్ద ధర్నా చేస్తున్న మత్స్యకారులు

జన్నారం, జూన్ 23: కిష్టాపూర్ ఊరచెరువువద్ద చర్లపల్లి, కిష్టాపూర్ గ్రామాలకు చెందిన మత్స్యకారులు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ 30 ఎకరాల ఊర చెరువును కిష్టాపూర్ చెందిన ఇద్దరు వ్యక్తులు అక్రమంగా ఒకరు 6ఎకరాలు, మరొకరు 2ఎకరాలకు పైగా కబ్జా చేసి మట్టి పోశారన్నారు. మట్టిని తొలగించాలని డిమాండ్ చేశారు. చెరువుపై ఆధారపడిన మత్స్యకారులకు, రైతులకు నష్టం జరుగుతుందని, మట్టిని తొలగించాలని బైఠాయించారు. విషయం తెలుసుకున్న నీటి పారుదల శాఖ డిప్యూటీ ఈఈ వెంకటేశం, జేఈ రాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య, సర్వేయర్ సురేష్‌లు సంఘటన స్థలానికి చేరుకున్నారు. సమస్య పరిష్కరించేంత వరకు ధర్నా విరమించమని రాత్రి వరకు అక్కడే ఉన్నారు. మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు నర్సయ్య, రాజం, శ్రీనివాస్, చిరంజీవి, లింగన్న, లచ్చవ్వ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ ఫారెస్టు అసోసియేషన్ కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

జన్నారం, జూన్ 23: జూనియర్‌ఫారెస్టు అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం స్థానికఅటవీశాఖ టీడీసీ సెంటర్‌లో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా జోనల్ కార్యదర్శి సుభాష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అజర్‌ల ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా శేషారావు, ఉపాధ్యక్షుడిగా లాలుబాయి, ప్రధాన కార్యదర్శి ముజీబుద్దీన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణరావు, జాయింట్ సెక్రట రీగా కృష్ణమూర్తి, కోశాధికారిగా అనిల్‌లను ఎన్నుకున్నారు.

సీఎంను కలిసిన పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

ఏసీసీ, జూన్ 23 : పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు ధరణి కోట వేణుగోపాల్ ఆదివారం హైద్రాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ 20 ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న పండిట్, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్ సమస్యను పరిష్కరించి ప్రమోషన్‌లు కల్పించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారన్నారు

రోడ్డుపై ఎడారి ఓడలు



పెంచికలపేటలో ఒంటెలతో గుజరాత్ ప్రజలు

పెంచికలపేట, జూన్ 23: ఎడారి ఓడగా పిలిచే ఒంటెలు మండల కేంద్రంలో దర్శనమిచ్చాయి. సహజంగా రాజస్థాన్, గుజరాత్ నుంచి కొంతమంది కుటుంబ సమేతంగా ఉపాధి నిమిత్తం రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో ఒంటెలతో సంచరిస్తుంటారు. ఈ క్రమంలో ఆదివారం మండలంలోని పలుగ్రామాల గుండా ఒంటెలు వెళ్తుంటే ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

పొంచి ఉన్న ప్రమాదం



విరిగి ఉన్న విద్యుత్ స్తంభం

కెరమెరి, జూన్ 23: మండల కేంద్రంలోని సుల్తాన్‌గూడ గ్రామంలో ఆసిఫాబాద్-ఉట్నూర్ ఆర్‌అండ్‌బీ రోడ్డుపక్కన 11కేవీ విద్యుత్‌లైన్ స్తంభం వంగి ఏళ్లు గడుస్తున్నా విద్యుత్ శాఖాధికారులు పట్టించుకోవడం లేదని సుల్తాన్‌గూడ గ్రామస్థులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి స్తంభంను మార్చి వేరేస్తంభాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్ అధికారులకు పలు మార్లు విన్నవించినట్లు తెలిపారు.

మట్కా ఆడుతున్న ఒకరిపై కేసు

కాగజ్‌నగర్, జూన్ 23: కాగజ్‌నగర్ పట్టణంలో అంబేద్కర్ చౌక్‌లో మట్కా ఆడుతున్న ఇందిరా మార్కెట్‌కు చెందిన ఆఫ్తాబ్ హుస్సేన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆఫ్తాబ్ హుస్సేన్ వద్ద చిట్టీలు, నగదు లభ్యమైనట్లు పేర్కొన్నారు.

తప్పుదారి పట్టించటం సరికాదు

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్

కాగజ్‌నగర్, జూన్ 23: ఎస్సీ, ఎస్టీ కేసులో తప్పుదారి పట్టించేలా చేసిన కాగజ్‌నగర్‌కు చెందిన ఓ వైద్యురాలిపై తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ డిమాండు చేశారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెలరోజుల క్రితం ప్రయివేటు ఆసుపత్రి ఎదుట జరిగిన గలాటలో శ్రీనివాస్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయటం ఎంత వరకు సమంజమన్నారు. వైద్యురాలి నవ్యపై విచారణ జరపాలన్నారు. సమావేశంలో బాధితుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి పోలీసుల తోడ్పాటు


గిరిజనులకు సరుకులు అందిస్తున్న ఏసీపీ రవికుమార్, పోలీసులు

బెల్లంపల్లి(తాండూర్), జూన్ 23 : గిరిజనుల అభ్యున్నతికి పోలీసులు తోడ్పాటు అందిస్తారని ఏసీపీ రవికుమార్ అన్నారు. ఆదివారం తాండూర్ మండలం నర్సాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామంలో రాబిన్ హుడ్ ఆర్మీ దాతల సహకారంతో పోలీసులు గిరిజనులకు సరుకులు పంపిణీ చేశారు. ఏసీపీ మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీస్ ఆధ్వర్యంలో గిరిజనులను చైతన్యపరిచేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామన్నారు. యువతను అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు నేరాలకు దూరంగా ఉండేలా వారి అభ్యున్నతికి పాల్పడుతున్నామన్నారు. గిరిజన గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా పోలీసుల దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సీఐ కుమారస్వామి, ఎస్‌ఐ కిరణ్‌కుమార్, మాదారం ఎస్‌ఐతో పాటు పోలీసులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతోనే నేరాల నియంత్రణ


సీసీ కెమెరాలు ప్రారంభించి మాట్లాడుతున్న ఎస్‌ఐ

జైపూర్, జూన్ 23 :సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని ఎస్‌ఐ శ్రీధర్ పేర్కొన్నారు. ఆదివారం ఇందారంలోని శివాలయం చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని ఆయన సూచించారు. నేరాలు, దొంగతనాలు జరిగినప్పుడు సీసీ కెమెరాల ద్వారా నిందితులను సులువుగా గుర్తించవచ్చని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ ఫయాజ్, అరికె సంతోష్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఫయాజ్, ప్రకాష్‌రావు, షరీఫ్, నిసార్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన సీఐ



ఏసీసీ, జూన్ 23: శ్రీరాంపూర్ మహిళ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బది లీపై వచ్చిన రాజమౌళి శనివారం రాత్రి బాధ్యలు చేపట్టారు. పోలీసు సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న ఎద్దుల పట్టివేత

భీమిని, జూన్ 23 : భీమిని పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపూర్ వద్ద ఆదివారం సాయంత్రం అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఎద్దులను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని దుబ్బగూడెం నుంచి జగిత్యాలకు డీసీఎం వాహనంలో ఎడ్లను తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు వాహనాన్ని తనిఖీ చేశామన్నారు. నాలుగు ఎద్దులను స్వాధీనం చేసుకుని అచ్చలాపూర్ సమీపంలోని గోశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. జగిత్యాలకు చెందిన దండియా తిరుపతి, చేర తిరుపతిలపై కేసు నమోదు చేసుకుని డీసీఎం వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బోనమెత్తిన పల్లెలు


పోచమ్మ ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

దండేపల్లి, జూన్ 23: నెల్కివెంకటాపూర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పెద్దమ్మతల్లి బోనాలను వైభవంగా నిర్వహించారు. యేటా జూన్ చివరి ఆదివారం పెద్దమ్మతల్లికి ప్రత్యేక బోనాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. మహిళలు బోనం ఎత్తుకొని డప్పుచప్పుళ్లతో ఆలయానికి చేరుకున్నారు. పెద్దమ్మతల్లికి బోనం సమర్పించి పూజలు చేశారు. మేకలు, కోళ్లను బలిచ్చి చల్లంగా చూడాలని మొక్కులు తీర్చుకున్నారు.

ముత్యంపేటలో పోచమ్మ తల్లి ఆలయంలో


నెల్కివెంకటాపూర్‌లో పెద్దమ్మతల్లి బోనాలు

ఎదురు పోచమ్మ బోనాలను నిర్వహించారు. పంబాలి పూజారులు పోచమ్మ తల్లి ఆలయంలో నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. మహిళలు బోనంతో ఆలయం చుట్టు ప్రదక్షిణ చేసి నైవేద్యం సమర్పించారు.

మందమర్రిరూరల్: పొన్నారంలో పోచమ్మ తల్లి బోనాలను నిర్వహించారు. బోనాలతో ఆలయానికి వచ్చి ప్రదక్షిణలు చేసి పోచమ్మకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కోళ్ల, మేకలను బలిచ్చారు. మాజీ సర్పంచు సంకె లక్ష్మీశ్రీనివాస్, రాం చందర్, రాజేశ్వరి, సుశీల, నాగయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ ఈద లింగయ్య, రాజమణి, రాములు, సంపత్ , రవళి తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు: ఎర్రగుంటపల్లి, నాగాపూర్ గ్రామాల్లో శనివారం ప్రారంభించిన ఊరు కొలుపు కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఆయా గ్రామాల్లో డప్పుచప్పుళ్లతో దేవతల వద్దకు ఊరే గింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోళ్లను బలిచ్చారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు పండాలని, ప్రజలందరు సం తోషంగా ఉండాలని కొలుపులను నిర్వహించారు. కొత్తగూడెం ప్రాంతంలోని కొండ పోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు బోనాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. జంతుబలులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

సప్తవర్ణ శోభితం



దండేపల్లి, జూన్ 23: మాదాపూర్ శివారులో ఆదివారం సాయంత్రం ఇంద్రధనస్సు కనువిందు చేసింది. మబ్బులు కమ్ముకొని చిరు జల్లులు కురిసిన అనంతరం ఆకాశంలో ఏడు రంగులతో ఇంద్రధనస్సు ఆవిష్కృతమైంది.

పదోన్నతుల్లో అర్హత కలిగిన ఎస్జీటీలకు అన్యాయం

ఏసీసీ, జూన్ 23 : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయుల పదోన్నతుల్లో అర్హత కలిగిన సెకండరీ గ్రేడ్ టీచర్లకు అన్యాయం జరిగిందని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకర్, రాజేందర్‌లు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హాలులో నిర్వహించిన సంఘం సమావేశంలో వారు మాట్లాడుతూ పదోన్నతుల్లో స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్, ఫిజికల్ డైరెక్టర్‌కు అర్హత కలిగిన ఎస్జీటీలకు అవకాశం కల్పించలేదన్నారు. 25 ఏండ్ల అర్హత ఉండి ఎస్జీటీలకు పదోన్నతులు రాలేదని, 2012, 17లో నియామకం పొందిన స్కూల్ అసిస్టెంట్‌లకు లాంగ్వేజెస్, వ్యాయామ ఉపాధ్యాయ ప్రమోషన్‌లు ఇవ్వడం వారికంటే సీనియర్‌లు అయిన ఎస్జీలకు నష్టం జరిగిందన్నారు. వెంటనే ఎస్జీటీలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రంజిత్, కిరణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

హాజీపూర్, జూన్ 23 : ముల్కల్ల గ్రామానికి చెందిన ఆవునూరి రాములు కూతురు రమ్య గల పది రోజుల క్రితం మృతి చెందగా గ్రామ కాంగ్రెస్ నాయకుడు నాయికిని సురేందర్ కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేల ఆర్థిక సహాయం అందించారు. అలాగే బియ్యాల రమేష్ 50 కేజీల బియ్యం అందజేశారు. బాణమ్మ, సాంబయ్య, లక్ష్మణ్,సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎంపిక పోటీలు

కన్నెపల్లి, జూన్ 23: బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, నెన్నెల మండలాలకు చెందిన విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూల్‌లో 5వ తరగతిలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల కోసం ఈ నెల 25న ఉదయం 11 గంటలకు బెల్లంపల్లిలోని ఏఎంసీ 2 గ్రౌండ్‌లో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

భీమారం, జూన్ 23 : భీమారం మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో 139 బస్తాల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పట్టా పాస్ బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో వచ్చి విత్తనాలు తీసుకువెళ్లాలని సూచించారు.

సంకల్పం ఉంటేనే విజయం సాధ్యం


హ్యాండ్‌బాల్ క్రీడాకారులను సన్మానిస్తున్న సభ్యులు

మందమర్రిటౌన్, జూన్ 23: సాధించాలనే సంకల్పం ఉంటే ఎంచుకున్న రంగంలో విజయం సాధిస్తారని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సభ్యుడు కనపర్తి రమేష్, కాంగ్రెస్ నాయకులు కాంపెల్లి సమ్మయ్య, దుర్గం నరేష్‌లు తెలిపారు. ఆదివారం సీఈఆర్ క్లబ్‌లో వరల్డ్ హ్యాండ్ బాల్ డే కార్యక్రమంలో మాట్లాడారు. హ్యాండ్‌బాల్ క్రీడాకారుల అభివృద్ధికి అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గోనె శ్యాంసుందర్ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి హ్యాండ్ బాల్ డేను ప్రారంభించారు. పతకాలు సాధించిన హ్యాండ్‌బాల్ క్రీడాకారులను సన్మానించి బహుమతులు అందించారు. హ్యాండ్‌బాల్ అభివృద్ధికి కృషి చేస్తున్న రమేష్‌ను సన్మానించారు. సీనియర్ క్రీడాకారులు రాంవెంకటేశ్వర్లు, రమేష్, కాంగ్రెస్ నాయకులు గుడ్ల రమేష్, కోచ్‌లు అరవింద్, రాజలింగు, సాయి కళ్యాణ్, కార్తీక్, విశాల, గౌరమ్మ, పాల్గొన్నారు.

ఆకట్టుకొన్న పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



దండేపల్లి, చెన్నూరులో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

దండేపల్లి, జూన్ 23: దండేపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2003-04లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 20 ఏండ్ల తర్వాత ఆదివారం ఒకచోట కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి గురువులను విద్యా బోధన చేసిన గురువులను సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం ఆటాపాటల ఎంతోగాను ఆకట్టుకున్నాయి.

చెన్నూరు: చెన్నూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల 1998-2000 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంను ఆదివారం పట్టణంలోని ఎస్ఎస్ఆర్ ఘనంగా నిర్వహించారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఉత్సాహంగా గడిపారు. అప్పటి అధ్యాపకులు బాల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

మందమర్రి టౌన్: పట్టణంలోని మేదరిబస్తీ యూపీఎస్ స్కూల్‌కు చెందిన 7వ తరగతి 1986-87 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు హాజరయ్యారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ఒకరినొకరు పలుకరించుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు సతీష్ మాట్లాడుతూ తమ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.


మందమర్రిలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చెరువును తలపిస్తున్న పోచంలొద్ది రోడ్డు

- రోడ్డుపై ఏర్పడిన గుంత
- ఒకేరోజు 9మందికి స్వల్పగాయాలు


రోడ్డుపై దిగబడిన ఆటోను ముందుకు నెడుతున్న ప్రయాణికులు

జైనూర్, జూన్ 23: మండలంలోని పోచంలొద్ది సమీప వంతెన వద్ద ప్రధానరోడ్డుపై వర్షం కారణంగా సుమారు 2ఫీట్ల లోతైన గుంత ఏర్పడింది. దీంతో తాజాగా శని, ఆదివారాల్లో సుమారు 9మందికి స్వల్పగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. వంతెనకు దగ్గరగా లోతైన గుంత ఏర్పడటంతో అది వాహనదారులకు సమీపంగా వచ్చే వరకు కనిపించటంలేదు. అదేవిధంగా వర్షపు మురికినీరు గుంతలో పూర్తిగా నిండిపోవడంతో డ్రైవర్లకు లోతు తెలియక వాహనాలు అందులో దిగబడుతున్నాయి. దీంతో శనివారం ఉట్నూరు నుంచి రాకపోకలు చేస్తున్న కొంతమంది ప్రయాణికులు గాయపడ్డారు. అదేవిధంగా ద్విచక్రవాహనాలు సైతంగుంతలో పడిపోతుండటంతో వాహనదారులు గాయపడ్డారు. పవర్‌గూడ సమీపంలో గల వంతెన, జైనూరులోని బస్టాండ్ ప్రాంతంలో కూడా భారీగుంతలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు సత్వరమే ప్రధానరోడ్డుపై ఏర్పడిన గుంతల్ని పూడ్చి వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఒక్క చోట చేరిన పూర్వ విద్యార్థులు

వాంకిడి, జూన్ 23: మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-95లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి గతఅనుభవాలను నెమరు వేసుకున్నారు. 30 సంవత్సరాల తరువాత కలుసుకున్న వారంతా ఒకరినొకరు పలుకరించుకొని వారి జీవన స్థితిగతులు తెలుసుకుని రోజంతా ఆనందంగా గడిపారు. ఆనాడు చదుకున్న విద్యార్థుల సమా చారం సేకరించి అందరినీ ఈ ఆత్మీయ సమ్మేళనానికి వచ్చేలా కృషిచేసిన పూర్వవిద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సాంబయ్య, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

అంకుసాపూర్‌లో పోడు రగడ

కాగజ్‌నగర్, జూన్ 23: కాగజ్‌నగర్ అంకుసాపూర్ అటవీ ప్రాంతం లో పోడురగడ ఆదివారం చోటుచేసుకుంది. అటవీప్రాంతంలోని పోడు భూముల్లో రైతులు నాట్లు వేసేందుకు పోడుభూములను దున్నేందుకు ప్రయత్నించగా ఎఫ్ఆర్‌వో రమాదేవి, సిబ్బంది రైతులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై సోనియా మాట్లాడి పోడు రైతులను సముదాయించటంతో ఇరువర్గాలతో మాట్లాడి సమస్యను సద్దుమణిగేలా చేశారు.

దహెగాం మండలానికి నిలిచిపోయిన రాకపోకలు


అందవెల్లి పెద్దవాగులో కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన

దహెగాం, జూన్ 23: దహెగాం, కాగజ్‌నగర్ మండలాల మధ్య ఉన్న తాత్కాలిక వంతెన కొట్టుకు పోగా కాగజ్‌నగర్ మీదుగా దహెగాం మండలానికి రాక పోకలు నిలిచిపోయాయి. ఇదే రహదారి గుండా దహెగాం మండలంలోని 50గ్రామాలకు, భీమిని మండలంలోని కేస్లాపూర్, చిన్నగుడిపేట గ్రామాల ప్రజలు కాగజ్‌నగర్ పట్టణానికి పలు అవసరాల నిమిత్తం రాకపోకలు సాగిస్తారు. అదేవిధంగా మండలంలోని ఇట్యాల, రాళ్లగూడ, కోత్మీర్, బోర్లకుంట, బీబ్రా, పెసరి కుంట, అయినం తదితర గ్రామాల ప్రజలు పెంచికలపేట మండలం మీదుగా కాగజ్‌నగర్ పట్టణానికి చేరుకుంటున్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు..

- తిరుపతి, ఇట్యాల



మూడు సంవత్సరాలుగా వర్షాకాలం ఇబ్బందులు పడుతున్నాం. అందవెల్లి పెద్ద వాగు వంతెన కుంగి కూలిపోయింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వేగంగా వంతెన నిర్మాణ పనులు పూర్తిచేయాలి.

అధికారులు పట్టించుకోవడం లేదు..

- శ్యాంరావు, అయినం



అందవెల్లి పెద్దవాగు వద్ద నిర్మిస్తున్న పనులను అధికారులు పట్టించుకోకపోవడంతో ఆలస్యమవుతోంది. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. కాగజ్‌నగర్ పట్టణానికి వెళ్లాలంటే పెంచికలపేట మండలం మీదుగా వెళ్తే అధిక ఖర్చులు అవుతున్నాయి. తక్షణం వంతెన పూర్తి చేయాలి.

సాయికిరణ్ హత్య కేసులో నిందితుల అరెస్టు

మానకొండూర్, జూన్ 23: మానకొండూర్‌కు చెందిన సాయికిరణ్ హత్య కేసులో నలుగురు నిందితులను మానకొండూర్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సాయికిరణ్‌ను హత్య చేసిన బట్టి శ్రీనివాస్, బట్టి సునీత, తమ్మిడి గంగారాం, భీమంకర్‌శ్యాంరావును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఆదేశాలతో నలుగురిని 14రోజుల రిమాండ్‌కు కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. మానకొండూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయికిరణ్ కొద్దికాలం కిందట సిద్దిపేట జిల్లా మిడిదొడ్డి మండలం కొండాపూర్‌లో కోళ్లఫాంలో కూలీగా పనిచేస్తూ భార్యపిల్లతో కలిసిఉండేవాడు. అదే ఫాంలో పనిచేస్తున్న బట్టి శ్రీనివాస్, బట్టి సునీతలతో సాయికిరణ్‌కు స్నేహం ఏర్పడింది. సునీతతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో వారి మధ్య గొడవ జరగడంతో అక్కడ పనిమానేసిన సాయికిరణ్ మానకొండూర్‌కు వచ్చి ఒకసామిల్‌లో పనిచేస్తుండేవాడు. ఏప్రిల్ 18న సాయికిరణ్ కొండాపూర్ ఫాంకు వెళ్లి అక్కడ శ్రీనివాస్, సునీతతో మళ్లీ గొడవపడ్డాడు. దీంతో శ్రీనివాస్, అతనిభార్య సునీత అక్కడినుంచి వారి స్వగ్రామం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం బారెగూడెకు వెళ్లిపోయారు. అయినప్పటికీ సాయికిరణ్ వారికి ఫోన్ చేసి వేధించసాగాడు. దీంతో విసిగిపోయిన బట్టి శ్రీనివాస్, సునీత దంపతులు ఎలాగైనా సాయికిరణ్‌ను అడ్డుతొలగించుకునేందుకు పథకం రచించారు. ఈ మేరకు ఏప్రిల్ 19న సునీతతో సాయికిరణ్‌కు ఫోన్ చేయించి వారి స్వగ్రామానికి పిలిపించుకున్నారు. సాయికిరణ్ రాగానే అతడిపై కర్రలతో దాడిచేసి హత్యచేశారు. అనంతరం సాయికిరణ్ మృతదేహాన్ని పాడుబడిన వ్యవసాయబావిలో పడేశారు. ఏప్రిల్ 18న ఇంటి నుంచి బయటకు వెళ్లిన సాయికిరణ్ ఇంటికి రాలేదని అతడి భార్య మానకొండూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదుచేసి రెండు నెలలపాటు తీవ్రంగా గాలించి నిందితులను పట్టుకున్నారు.

గోండి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలి


మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర నాయకుడు దౌలత్‌రావు

సిర్పూర్(యు), జూన్ 23: గోండి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని రాజ్‌గోండ్ సేవాసమితి తెలంగాణ రాష్ట్ర గౌరవఅధ్యక్షుడు కోరెంగ దౌలత్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మహారాష్ట్రలోని గోండియాజిల్లా సాలెకసా తాలుక పోరెపాటార్ ధనేగాం కాచ్పర్‌ఘడ్‌లో గోండ్వాన జాతీయమహాసభలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి వివిధ ఆదివాసీసంఘాల సభ్యులు సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్‌గోండ్ సేవాసమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కోరెంగ దౌలత్ రావు మాట్లాడుతూ దేశంలోని 21 రాష్ట్రాల్లో గోండ్ భాష మాట్లాడేవారు ఉన్నారన్నారు. ఇంతపెద్ద సంఖ్యలో గోండిభాష మాట్లాడేవారు ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం గోండిభాషను రాజ్యాంగంలోని 8వషెడ్యూల్‌లో చేర్చడం లేదన్నారు. గోండ్ మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు సిడం అర్జు మాట్లాడుతూ దేశంలో చేపట్టబోయే జనగనణలో ఆదివాసీలకు గతంలో ఉన్నకోడ్‌ను పునఃరుద్ధరించాలన్నారు. అనంతరం గోండ్‌మహాసభ పలు తీర్మాణాలు చేసింది. ఈ సదస్సులో మహారాష్ట్రతోపాటు తెలంగాణ,చత్తీస్‌ఘడ్, అసాం, ఒడిస్సా, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, వెస్ట్‌బెంగాల్, జార్ఖండ్, ఉత్తర్ ప్రదేశ్ తదితర రాష్ట్రలనుంచి ప్రతినిధిబృందాలు పాల్గొన్నారన్నారు.కార్యక్రమంలో తెలంగాణనుంచి ఆదివాసీ సంఘాల నాయకులు పెందోర్ గోపి, పెందోర్ ప్రభకార్, మంగం విశంరావు, కుమ్ర శంకర్, కోరెంగం మోతీరాం తదితరులు పాల్గొన్నారు.

పూడిక తొలగించరూ!

తిర్యాణి, జూన్ 23: మండలంలోని గుండాల(దబ్బగూడ)మైసమ్మ చెరువు కాలువపూడికతో నిండిపోయింది. దీంతో నీళ్లరాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చెరువుకింద 20ఎకరాలు ఉన్నా సరిగ్గా నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చెరువు నిర్మించినప్పటి నుంచి దానికి కనీస మరమ్మతులు కూడా చేయ లేదని వాపోతున్నారు. చెరువు బాగు చేయాలని ఉపాధిహామీ పనిలో కూడా అప్లికేషన్ పెట్టామని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు కాలువ పూడికతీతను చేపట్టి రైతులకు కాలువ నీరందే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


పూడికతో కూరుకుపోయిన కాలువ

ఉపాధ్యాయుడు దేవాజీ సేవలు మరువలేనివి

చింతలమానేపల్లి, జూన్ 23: మండలంలోని డబ్బా గ్రామంలోని జడ్పీ ఉన్నతపాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన రాంటెంకి దేవాజీ సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. ఆదివారం దేవాజీ పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ఆయన సేవలను కొనియాడారు. అనంతరం దేవాజీ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ నానయ్య, శ్రీశైలం, వెంకయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీటీసీలకు ఆత్మీయ వీడ్కోలు

రెబ్బెన, జూన్ 23: రెబ్బెన ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం ఎంపీటీసీలకు ఆత్మీయవీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సౌందర్య మాట్లాడుతూ ఎంపీటీసీలు, జడ్పీటీసీలు పదవీ కాలం 54 సంవత్సరాలు పూర్తి అయినట్టు వివరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సంతోష్, వైస్ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీడీవో శంకరమ్మ,తదితరులు పాల్గొన్నారు.

ఇనుపరాడు గుచ్చుకుని బాలుడి మృతి


రిషి(ఫైల్)

వాంకిడి, జూన్ 23: మండలంలోని సరండి గ్రామంలో ఇనుపరాడు గుచ్చుకుని రషిక, బీమావు దంపతుల ఏడేళ్ల బాలుడు మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. రిషితోపాటు మరికొందరు పిల్లలు ఇంటిస్లాబ్‌పై ఆడుకుంటున్నారు. ప్రమాదవశాత్తు రిషి ఇనుపరాడుపై పడ్డాడు. ఇనుప రాడు రిషి కడుపులో గుచ్చుకోవడంతో గాయపడ్డాడు. గమనించిన తోటి పిల్లలు కుటుంబ సభ్యులకు తెలపడంతో వెంటనే అతన్ని ఆసిఫాబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సాగర్ తెలిపారు.

నీట్‌ను రద్దు చేయాలి

కెరమెరి, జూన్ 23: నీట్‌పరీక్షను రద్దుచేసి మళ్లీనిర్వహించాలని ఎస్ఎఫ్ఐనాయకుడు జాఫర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షను రద్దు చేయనట్లయితే కేంద్రమంత్రి బండి సంజయ్ ఇంటిని ముట్టడిస్తామన్నారు. నీట్‌ను వెంటనే రద్దుచేసి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాంచందర్, లక్ష్మణ్, తిరుపతి, సాయికుమార్, గోపిచందర్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలకు రెక్కలు

కెరమెరి, జూన్ 23: మండలకేంద్రంలో ఆదివారం వారసంతలో కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. ఏ కూరగాయను ముట్టుకున్న రూ.60నుంచి రూ.160కి కిలో ధర పలికింది. దీంతో సామాన్య ప్రజలు వారసంతకు వచ్చి ఖాళీసంచులతో వెనుతిరగాల్సిన పరిస్థితి నెలకొంది. వారసంతలో కిలో టమాట రూ.60, క్యాబేజి, క్యాలిఫ్లవర్ కిలోరూ.120, పచ్చిమిర్చిరూ.160,తోటకూర, పాలకూరకట్ట రూ.20, వంకాయలురూ.60, గోరుచిక్కుడురూ.80, చిక్కుడు రూ.100, క్యాప్సికం రూ.100 ధర పలికింది.

ఇద్దరిపై కేసు నమోదు

కాగజ్‌నగర్, జూన్ 23: ఇందిరామార్కెట్‌లో ప్రహరి విషయంలో దాడికి పాల్పడిన ఇరువర్గాలపై ఆదివారం కేసునమోదు చేసినట్టు ఎస్సైమహేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఇందిరామార్కెట్‌లో కల్వచర్ల రాజు ప్రహరీవిషయంలో వివాదం తలెత్తగా ఘర్షణకు పాల్పడిన శ్రీనివాస్, శివపై కేసునమోదు చేసినట్టు వివరించారు.


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ఎరువులపై నిఘా

- ముమ్మరంగా అధికారుల తనిఖీలు
- జిల్లా వ్యాప్తంగా 320కిపైగా దుకాణాలు
- అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు
- జిల్లాలో ఎరువుల కొరత లేదు: అధికారులు

కాగజ్‌నగర్ టౌన్, జూన్ 23: వానాకాలం పంటలసాగు ముమ్మరమైన నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఎరువుల దుకాణాలపై అధికారులు నిఘా పెంచారు. ఇందులో భాగంగా ఆయాశాఖల అధికారులు షాపుల్లో తని ఖీలు చేపడుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 320కిపైగా ఫెర్టిలైజర్ దుకా ణాల్లో రెవెన్యూ, పోలీసు, వ్యవసాయశాఖాధికారులు, టాస్క్‌ఫోర్స్ అధి కారులు సోదాలు చేస్తున్నారు. వానాకాలానికి సంబంధించిన విత్తనాలు, ఎరువులు విక్రయాలపై జిల్లా అధికారయంత్రాంగం ప్రత్యేకదృష్టి సారిం చింది.రైతులకు ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించేందుకు వ్యవసాయశాఖ చర్యలు తీసుకుంటోంది. ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై చర్యలు తప్పవని హెచ్చరిస్తోంది. డీలర్లవద్ద ఉన్న స్టాకువివరాలు, సేక రించడంతోపాటు పాతధరకే రైతులకు విక్రయించాలని ఆదేశాలు జారీచేశారు. గతేడాది మిగిలిన ఎరువులు పాత ధరలకే విక్రయించాలని పేర్కొంటున్నారు. అలాగే కృతిమ ఎరువుల కొరత సృష్టిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. లైసెన్సు ఉన్న దుకాణాల్లోనే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేయాలని రైతులకు అవగా హన కల్పిస్తున్నారు.

అందుబాటులో ఎరువులు, విత్తనాలు..

-రామక్రిష్ణ, వ్యవసాయాధికారి కాగజ్‌నగర్

వానాకాలం రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాం. విత్తనాలు ఎరువులు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఆదేశాలున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కృత్రిమ, కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

● అందుబాటులోనే ఎరువులు..

కాగా జిల్లావ్యాప్తంగా రైతులకు అందుబాటులోనే ఎరువులు, విత్తనాలు, ఇతర వస్తువులు అందుబాటులో ఉన్నాయని అధికారులు పేర్కొం టున్నారు. జిల్లాలో ఈ ఏడాది 5లక్షల ఎకరాల పంటసాగు అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. కేవలం పత్తి పంటనే 4లక్షల ఎకరాల్లో సాగు చేస్తుండగా, మిగిలిన వరి 1లక్ష, కంది 20వేల ఎకరాలు కూర గాయలు, ఇతర పప్పు ధాన్యాల పంటలు సాగులో ఉంటాయని తెలి పారు. కాగజ్‌నగర్ డివిజన్‌లో రైతులకు ఎరువుల కొరత లేదని ఏవో రామక్రిష్ణ తెలిపారు. అలాగే కృత్రిమకొరత సృష్టించకుండా తనిఖీలు ముమ్మరం చేస్తున్నామన్నారు. ప్రసుతసీజన్‌లో 40వేల మెట్రిక్‌టన్నుల యూరియా, అవసరం కాగా పూర్తిస్థాయిలో అందు బాటులో ఉందన్నారు. అలాగే డీఏపీ 40వేలు, పత్తి విత్తనాలు అవసరం మేరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందజేస్తున్నామని ఏవో తెలిపారు. కాంప్లెక్స్ ఎరువులు 20మెట్రిక్ టన్నులు ఉన్నాయని పేరొంటున్నారు. ఇందులో భాగంగా గ్రోమోర్, ఏఎస్ఆర్కే, డీసీఎంఎస్‌ల ద్వారా రైతులకు అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ మేరకు రైతులకు అన్నిరకాల విత్తనాలు, ఎరువులు, మందులు అందుబాటులో ఉంచేందుకు ప్రత్యేకచర్యలు తీసుకుం టున్నారు.

డాక్టర్ శ్యాంరావు ముఖర్జీ వర్ధంతి


వర్ధంతిలో పాల్గొన్న నాయకులు

కాగజ్‌నగర్, జూన్ 23: కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ శ్యాంరావు ముఖర్జీ 71వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు పూలమాలలు వేసిన నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ డాక్టర్ శ్యాంరావు ముఖర్జి ఆశయాల సాధన కోసం అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ దేశం కోసం ఎనలేని సేవలు చేసిన మహనీయుడు డాక్టర్‌శ్యాంరావు ముఖర్జీ అని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, సిందం శ్రీనివాస్, దోని‌శ్రీశైలం, ముత్తు ఆశోక్, చన్నపురి గణపతి, వీరభద్రచారి, శ్రీదేవి, చిప్పకుర్తిశ్రీనివాస్ తదితరులున్నారు.

పెంచికలపేట: మండలకేంద్రంలో ప్రముఖ పార్లమెంటరీయన్, జాతీయవాది, మాజీకేంద్రమంత్రి జన్‌సంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాస్ దివాస్‌ను ఆదివారంఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మధుకర్, సంతోష్, వెంకన్న, సంతోష్, నానయ్య, కిషన్, మహేష్ పాల్గొన్నారు.

అటవీ ప్రాంతాల్లో జియాలాజికల్ సర్వే


కాగజ్‌నగర్ అడవిలో సర్వే చేస్తున్న అధికారులు

కాగజ్‌నగర్, జూన్ 23: కాగజ్‌నగర్ అటవీ ప్రాంతం కడంబా తదితర గ్రామాల్లో ఆదివారం అధికారులు జియోలాజికల్ సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌వో రమాదేవి మాట్లాడుతూ వృక్ష శిలాజాలను పరిశీలించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. సర్వేను డాక్టర్ మంజుషమహాజన్ ఆధ్వర్యంలో చేపట్టినట్టు వివరించారు.

పెంచికలపేట: పెంచికలపేట అటవీరేంజ్‌పరిధిలోని లోడ్‌పల్లి, కొండపల్లి సౌత్‌బీట్, కంపార్టుమెంట్ సెక్షన్లను ఆదివారం జియాలజికల్ డైరెక్టర్ మంజూషమహాజన్, సీనియర్ జియాలజిస్ట్ ఎస్ చక్రవర్తి, సీఎఫ్, ఎఫ్‌డీపీటీ, ఐఎఫ్ఎస్ శాంతారాంతో కలిసి పరిశీలించారు. ఇక్కడ వుడ్ ఫాసిల్స్(కర్రశిలాజాలు) పరిశీలించారు. అవి ఎలా ఏర్పడ్డాయి, వాటి వయస్సు ఎంత, అక్కడి రాళ్ల విచ్ఛేధనము చెందిన తీరును పరివీలించారు. ఇక్కడి వివిధ రకాల చెట్లు, ఆర్కిడ్సును పరిశీలించి ఒక జీవవైవిధ్య ప్రాంతంగా గుర్తిస్తా మన్నారు. వుడ్‌ఫాసిల్స్ కోట్ల సంవత్సరాల క్రితం నుంచి ఉన్నట్లుగా తెలిపారు. వారివెంట ఎఫ్ఆర్వో సుధాకర్, ప్రభాకర్, మహేష్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు మెడల్స్ అందజేత



మెడల్‌ను అందజేస్తున్న కిరణ్ కుమార్

కాగజ్‌నగర్, జూన్ 23: పది పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రిలియన్స్ ట్రెండ్స్ ఆధ్వర్యంలో మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా రిలియన్స్ ట్రెండ్స్ స్టోర్‌మేనేజర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థులకు తమసంస్థ ద్వారా మెడల్స్ ప్రతిభా పురస్కార అవార్డులు అందజేస్తున్నట్టు తెలిపారు. వీరిని ఆదర్శంగా తీసుకొని తోటి విద్యార్థులు రానున్న పరీక్షల్లో చక్కటిమార్కులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో కేరళ పాఠశాల కరస్పాండెంట్ సోని, సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ ప్రముఖుల్ని సన్మానించిన అరిగెల


మంత్రి కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న, మహేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న అరిగెల నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 23: కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని ఆదివారం ఆయన నివాసంలో ఆసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో పార్టీ బలోపేతం గురించి చర్చించారు. ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న కాలంలో తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేలా కృషి చేయాలని అన్నారు. ఆయనవెంట నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

మహేశ్వర్‌రెడ్డిని సన్మానించిన అరిగెల..

బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బీజేపీ సీనియర్ నాయకుడు, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానిం చారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో నెలకొన్న సమ స్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను అసెంబ్లీలో చర్చించాలని కోరారు. అలాగేపార్టీ బలోపేతానికి కృషి చేస్తా మని, రాబోయే కాలంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

● ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, జూన్ 23: జిల్లా వ్యాప్తంగా మూడు రోజులపాటు భారీనుంచి అతిభారీవర్షాలు కురిసే అవకావం ఉందని వాతావరణశాఖ సూచన మేరకు జిల్లా పోలీసులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం జిల్లాలోని పోలీసులతో ఏర్పాటు చేసిన టెలికాన్ఫరె న్స్‌లో ఆయన మాట్లాడుతూ పాత ఇళ్లు, శిథిలావస్థలో ఉన్న నివాసాలలో ఉండేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు వాగులుపొంగే రహదారుల్లో ప్రయాణాలు మానుకోవాలన్నారు. జిల్లాలో 24గంటలపాటు పెట్రోకార్స్, బ్లూకోల్ట్స్ సిబ్బందితో గస్తీనిర్వహిస్తూ ప్రజలను మరింతఅప్రమత్తం చేయాలన్నారు. ప్రాణహితనది తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నది దగ్గరకు ఈతకు, చేపట వేటకు వెళ్లరాదని, సెల్ఫీలు తీసుకోరాదని ఎస్పీ సూచించారు. చెరువులు అలుగుల వద్దకు పిల్లలు వెళ్లకుండా తల్లిదండ్రులు చూడాలన్నారు. భారీవర్షాల వల్ల ఏదైనా విపత్కర సమస్యవస్తే లోకల్‌పోలీసు అధికారలకు లేదా డయల్ 100కుసమాచారం అందిస్తే తక్షణ సహాయక రక్షణ చర్యలు చేపడుతామన్నారు.

పోలీసుల గస్తీ ఏర్పాటు

పెంచికలపేట, జూన్ 23: రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు కాగజ్‌నగర్, దహెగాం మండలాల మధ్య అందవెల్లి వద్ద ఉన్న పెద్దవాగు పై నిర్మించిన తాత్కాలికవంతెన వరదతో కొట్టుకుపోవడంతో దాదాపు 30గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో తెలియక ఎవరైనా అటుగాప్రయాణిస్తే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున దహెగాం ఎస్సై రాజు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందతో గస్తీ ఏర్పాటు చేశారు. వాహనాలు వాగు దాటకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఎస్సై తెలిపారు.

జిల్లాలో 14.5 మిల్లీమీటర్ల వర్షపాతం

ఆసిఫాబాద్: జిల్లాలో ఆదివారం14.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. జిల్లాలోని ఆసిఫాబాద్, కెరమెరి, తిర్యాణి, లింగాపూర్, కాగజ్‌నగర్, రెబ్బెన, జైనూరు, వాంకిడిమండలాల్లో మోస్తరువర్షం కురిసింది. వాంకిడిలో అత్యధికంగా 45.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా అత్యల్పంగాదహెగాం మండలంలో 0.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల, జూన్ 23: లోనవెల్లి సబ్‌స్టేషన్ నుంచి కౌటాల ఎస్ఎస్‌వరకు 33కేవీ విద్యుత్‌లైన్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9నుంచి 12 గంటల వరకు విద్యుత్‌సరఫరా అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏడీఈ రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. సిర్పూర్(టి) మండలం లోనవెల్లి, కౌటాలమండలం, చింతలమానేపల్లి,బెజ్జూరు మండలాల్లో విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఉచిత మెగాహెల్త్ క్యాంపు

కౌటాల, జూన్ 23: మండలంలోని విఠల్ మెడిక్యూర్ హాస్పిటల్‌లో సోమవారం ఉచిత మెగాహెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10నుంచి 4గంటల వరకు శిబిరం ఉంటుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొట్టుకుపోయిన అందవెల్లి పెద్దవాగు తాత్కాలిక రోడ్డు

- రాకపోకలకు అంతరాయం
- 50 గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- నేటినుంచి నిరవధిక నిరాహార దీక్ష
- సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు


తెగిన తాత్కాలిక రోడ్డు


సీఎంకు రాసిన లేఖను చూపుతున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, జూన్ 23: కాగజ్‌నగర్ అందవెల్లి పెద్ద వాగు బ్రిడ్జి కింద ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన ఆదివారం ఉదయం తెగిపోయింది. శనివారం రాత్రి ఎగువప్రాంతంలో కురిసిన భారీవర్షాల కారణంగా పెద్దవాగులో నీటిప్రవాహం పెరిగింది. నీటి ప్రవాహం పెరగటంతో పైపులతో సహా తాత్కాలిక వంతెన తెగిపోయింది. ఆదివారం ఉదయం నుంచి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. భీమిని, దహెగాం మండలాలకు చెందిన 50గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. ఈ రెండు మండలాల నుంచి కాగజ్‌నగర్‌లో విద్యార్థులు వివిధ పాఠశాలల్లో చదువుతున్నారు. తాత్కాలిక రోడ్డు తెగిపోవటంతో ప్రస్తుతం కాగజ్‌నగర్‌కు రావాలంటే తాండూరు మీదుగా రావాల్సి ఉంటుంది. అలా వెళ్లాలంటే అదనపు ఖర్చు అవుతుందని, సమయం కూడా అధికంగా అవుతుందని ఈ గ్రామాలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం రాకపోకలు వంతెనకు వేసిన తాత్కాలిక నిచ్చెన ద్వారా సాగిస్తున్నారు.

ప్రాజెక్టును పరిశీలించిన నాయకులు..

పెద్దవాగు బ్రిడ్జి తాత్కాలికరోడ్డు తెగిపోవటంతో ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీష్ బాబు మాట్లాడుతూ సోమవారం ఉదయం 9గంటల లోపు ఈ అప్రోచ్‌రోడ్డు నిర్మాణం పూర్తి చేయకపోతే నిరవధిక నిరాహార దీక్ష చేపడుతానని సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు కూడా ఈ విషయం పలుమార్లు తెలిపానని, ఇంతవరకు పట్టించుకోవటం లేదన్నారు. ఈ నిరాహార దీక్షకు రైతులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. ఆయన వెంట బీజేపీ నాయకులు కొంగ సత్యనారాయణ, సిందం శ్రీనివాస్, వీర భద్రచారి, ఆశోక్, దోని శ్రీశైలం, కాళిదాస్ మండల్ తదితరులున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినికి అభినందనలు


ఎంపికైన విద్యార్థిని అక్షర పటేల్

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 23: కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థిని రూపొందించిన ప్రాజెక్టు జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు ఎంపికైంది. జవహర్ నవోదయ విద్యాలయ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ముకుం అక్షరపటేల్ తన టీచర్ (గైడ్) రమావత్ శ్రీనివాస్ సాయంతో కలిసి రూపొందించిన 'బయోడిగ్రేడబుల్ సీడ్లింగ్ పుట్స్ ఫ్రం ప్యాడీగ్రాస్' జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. వరిపంటకోత అయిన తరువాత గడ్డిని కాల్చివేస్తారు. వరిగడ్డిని కాల్చడంవల్ల వాతావరణ కాలుష్యంతోపాటు ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారు. పంటదిగుబడి కూడా తగ్గుతుంది. మరికొంత సమాచారను వారిపెద్దనాన్న, చుట్టుపక్కల రైతులో తెలుసుని వరి గడ్డితో మొక్కలను పెంచే కుండీలను తయారు చేసి ఉపయోగించుకోవచ్చు అనుకున్నది. దీనివల్ల వాతావరణ కాలుష్యం, ప్లాస్టిక్ కాలుష్యం నివారించి పంటల దిగుబడిన పెంచవచ్చు అని తెలిపింది. ఈ సందర్భంగా డీఈవో అశోక్, సైన్స్ అధికారి మధుకర్, ప్రధానోపాధ్యా యుడు చక్రపాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు రాణి దుర్గావతి వర్ధంతి

జైనూరు, జూన్ 23: మండలంలోని దుబ్బగూడ చౌరస్తా వద్ద సోమవారం ఆదివాసీ వీరనారి రాణి దుర్గావతి వర్ధంతి నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ సంఘాల ఐక్యకార్యచరణ సమితి నాయకులు తెలిపారు. ఈసందర్భంగా జైనూరు, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల ఆదివాసులు తప్పక హాజరుకావాలని కోరారు. నాయకులు మేస్రం షేకు, కుంర శంకర్, మడావి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

జైనూర్, జూన్, 23: మండలకేంద్రంలోని మైనార్టీ గురుకులంలో తాత్కాలికప్రాతిపదికన పోస్టులు భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జైనూర్ గురుకులం ప్రిన్సిపాల్ మల్లేశ్వరి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా మహిళ సెక్యూరిటీ గార్డ్, వాచ్‌మెన్(పురుష), పీసీఈ, హౌజ్ కీపింగ్, స్కావెంజర్, వంట మనుషులు తదితర పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం 7093958576 నెంబరును సంప్రదించాలని కోరారు.

సేవా కార్యక్రమాల్లో వాసవి క్లబ్ ముందుంటుంది

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 23: సేవా కార్యక్రమాల్లో వాసవి క్లబ్ ఎప్పుడు ముందుంటుందని వాసవి క్లబ్ మండలాధ్యక్షుడు కొలిపాక శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వాసవీ మాత ఆలయంలో క్లబ్ ఆధ్వర్యంలో డాన్‌టుడస్కీ కార్యక్రమంలో భాగంగా 60మంది విద్యార్థులకు ముక్త సురేష్, గుండా బాలేశ్వర్, పాపిని శంకర్‌లో కలిసి నోటు పుస్తకాలు, పెన్నులు, వృద్ధులకు వాకింగ్ స్టిక్, ఒక పేద వ్యాపారికి తోపుడు బండి అందజేశారు. కార్యక్రమంలో క్లబ్‌సభ్యులు ఆదిత్య, శ్రీధర్, ప్రమోద్, వివేక్, వేణుగోపాల్, సంతోష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం..


అపరిశుభ్రంగా ఉన్న మురికి కాలువ

సిర్పూర్(టి), జూన్ 23: సిర్పూర్(టి) గ్రామ పంచాయతీ పరిధిలోని 14వార్డుల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. దీంతోవర్షాకాలంలో వ్యాధులు ప్రబలేఅవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు. మురికి కాలువులు, చేదబావులు, చేతిపంపులవద్ద ఇంతవరకు బ్లీచింగ్, దోమల నివారణమందు పిచికారి చేయలేదు. అధికారులు దీనిపైదృష్టి సారించడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుండగా వారికి అభివృద్ధిపనులు, నిధుల వినియోగంపై పూర్తి అధికారం లేకపోవడం కారణంగా తెలుస్తోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకనిధులు కేటాయించి ప్రతిగ్రామ పంచాయతీలో పారిశధ్యపనుల నిర్వహణకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం..

- కృష్ణమూర్తి, ఎంపీవో

మండలంలోని 16గ్రామపంచాయతీల్లో వర్షాకాలం సందర్భంగా పారిశుధ్య నిర్వహణపై ప్రతిగ్రామ పంచాయతీలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తాం. ప్రస్తుతం గ్రామపంచాయతీలకు అందుబాటులో ఉన్న బ్లీచింగ్ పౌడర్,బెటెక్స్‌స్ప్రే అవసరంఉన్నచోట వినియోగిస్తాం.

మురికి కాలువల్లో పూడికతీత పనులు


ఎక్స్‌కావేటర్‌తో పూడిక తొలగిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్, జూన్ 23: వర్షాకాలంను దృష్టిలో ఉంచుకొని వరదనీరు నిలువ ఉండకుండా ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని డ్రైనేజీలలో అధికారులు పూడికతీత పనులు చేపట్టారు. పట్టణంలోని పైకాజీ నగర్, కంఠకాలనీ, హడ్కో కాలనీల్లో మురికి కాలువల్లో పేరుకుపోయిన పూడిక, పిచ్చిమొక్కలను జేసీబీతో తొలగించారు. అలాగే కాలనీల్లోని మురికి కాలువలను సిబ్బందితో శుభ్రపరిచారు. ఈ సందర్భంగా కమిషనర్ భుజంగరావు మాట్లాడుతూ వర్షాకాలంలో వరదనీరు నిలువ ఉండకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డ్రైనేజీలలో పూడికతీత పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సంతోష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల హక్కులను కాపాడుతాం

మందమర్రిటౌన్, జూన్ 23: సంస్థను లాభాల్లో నడిపిస్తున్న కార్మికుల హక్కులను కాపాడుతామని, సమస్యలపై సమరశీల పోరాటాలను చేస్తామని ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి రీజియన్‌అధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య తెలిపారు. ఆదివారం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో నిర్వహించిన ఏరియా కార్యకర్తలు, నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ బొగ్గుగనులను ప్రైవేటు వారికి అప్పగించడానికి కుట్రలు చేస్తోందన్నారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సింగరేణి గనులను సింగరేణికే కేటాయించేలా చూడాలన్నారు. గనులను సింగరేణికే కేటాయించేలా సీఎం రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నారన్నారు. కొయ్యగూడెం, సత్తుపల్లి, మందమర్రి, కళ్యాణిఖని కేకే6, శ్రావణపల్లి మైన్‌లను సింగరేణికే ఇవ్వాలన్నారు. సమావేశంలో నాయకులు రాంశెట్టి నరేందర్, లక్ష్మణ్, సూర్యనారాయణ, వెంకటస్వామి, పిట్‌కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ చట్టం ప్రకారం వేతనాలు పెంచాలి

రామకృష్ణాపూర్, జూన్ 23: రామకృష్ణాపూర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఎస్‌సీసీడబ్ల్యూయు) బెల్లంపల్లి రీజియన్ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఏ వెంకన్న పాల్గొని మాట్లాడుతూ సింగరేణి పరిశ్రమలో పనిచేసే కాంట్రాక్టుకార్మికులకు ఫ్యాక్టరీచట్టం ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం కనీసం రామగుండంలోని ఎన్‌టీపీసీలో చెల్లించినట్టు అలవెన్స్‌ల రూపంలో కార్మికులకు వేతనాలు పెంచే అవకాశం ఉందని అన్నారు. అయినప్పటికీ సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులను కట్టు బానిసల్ల ఉపయోగించుకుంటుందని, శ్రమ దోపిడీకి పాల్పడుతోందన్నారు. సమస్యల పరిష్కారం కోసం కొత్తగా ఏర్పడ్డ రాష్ట్ర ప్రభుత్వంపైన, సింగరేణి యాజమాన్యం పైన బెల్లంపల్లి రీజియన్ వ్యాప్తంగా ఈనెల 25నుంచి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని బెల్లంపల్లి రీజియన్‌కమిటీ తీర్మానించిందన్నారు. సమావేశంలో బెల్లంపల్లి రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ జాఫర్, టి శ్రీనివాస్, రీజియన్ కమిటీ సభ్యులు బి యాదగిరి, జి మల్లేష్, ఎన్ శంకర్, రాజు, జి శ్రీనివాస్, రంజిత్, ఎం శంకర్, జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం కప్పతల్లి ఆటలు, పూజలు


ఆసిఫాబాద్‌లో కప్పతల్లి ఆట ఆడుతున్న రైతులు


బెజ్జూరులో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 23: వానాకాలం సీజన్ ప్రారంభమై 25రోజులు గడిచినప్పటికీ వర్షం పడకపోవడంతో జిల్లాలోని రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. వర్షంకోసం మండలంలోని దస్నాపూర్‌తోపాటు మోతుగూడ గ్రామానికి చెందిన రైతులు ఆదివారం కప్పతల్లి ఆటలు ఆడారు. ఈ సందర్భంగా వాగు మాట్లాడుతూ వందలాది ఎకరాల్లో గింజలు మొలకెత్తని పరిస్థితి ఉందని, కప్పతల్లి ఆటలతో దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

వర్షం కోసం కంది భీమన్నకు పూజలు

బెజ్జూరు: వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆదివారం మండలంలోని పాపన్ పేట గ్రామస్థులు కంది భీమన్న ఆలయంలో పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. మండలంలో కొద్ది రోజులుగా వర్షాలు కురవకపోవడంతో రైతులంతా ఆందోళనపడుతున్నారు. దీంతో గ్రామస్థులంతా వర్షాలు కురవాలని భాజాభజంత్రీలతో కంది భీమన్న ఆలయం చేరుకుని బోనాలను సమర్పించారు.

రెబ్బెన: రెబ్బెన మండలం ఇందిరానగర్‌లో దుర్గాదేవి ఆలయంలో ఆదివారం భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. సకాలంలో వర్షాలు కురవాలని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ ప్రధాన అర్చకుడు దేవరవినోద్ అన్నదానం నిర్వహించారు.